

నూతన జేసీగా శోభిక బాధ్యతలు



పార్వతీపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా ఎస్.ఎన్.శోభిక గురువారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టరేట్‌కు విచ్చేసిన ఆమెకు జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు, రెవెన్యూ డివిజనల్ అధికారులు హేమలత, వెంకటరమణ, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు కొనసాగించడానికి కృషి చేస్తానని జేసీ తెలిపారు.

అంతా శివమయం

- నేడు మహాశివరాత్రి
- ఉత్సవాలకు ముస్తాబైన శైవక్షేత్రాలు



సాలూరు రూరల్/భామిని, మార్చి 7: మహా శివరాత్రి ఉత్సవాలకు శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం నుంచి ఉత్సవాలు జరగనున్నాయి. సాలూరులోని పంచముఖేశ్వర, నగేశ్వర, వెలమపేటలోని కాశీవిశ్వేశ్వర, వేంకటేశ్వర కాలనీలోని ఉమారామలింగేశ్వర, మామిడిపల్లిలోని గిరిజా రామలింగేశ్వర, శివరాంపురంలోని శివాలయం, తదితర ఆలయాలు సిద్ధమయ్యాయి. పారమ్మకొండ, గుమ్మలకొండ, మంచాడవలస, గురువనాయుడుపేట కొండల వద్ద భక్తుల జాగరణకు సాంస్కృత కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు. పారమ్మ కొండకు 25 ప్రత్యేక బస్సులను రూ.20 చార్జితో నడపనున్నట్టు సాలూరు ఆర్టీసీ డిపో మేనేజర్ భాస్కరరెడ్డి తెలిపారు. భామిని మండలంలోని పెద్దదిమిలిలో వెలిసిన ఎండల మల్లికార్జునుడి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. శుక్రవారం నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ప్రాంతంతో పాటు కొత్తూరు, కాశీనగరం నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయ ధర్మకర్త హేమసుందరరావు, నాగేశ్వరరావు తెలిపారు.



సాలూరు వేంకటేశ్వర కాలనీలోని ఉమారామలింగేశ్వర ఆలయం



భామిని మండలం పెద్దదిమిలిలోని ఎండల మల్లికార్జునస్వామి ఆలయం



వైభవంగా ఉమారామలింగేశ్వరుని చక్రతీర్థ స్నానం



నదిలో చక్రతీర్థ స్నానాలు చేస్తున్న దృశ్యం

భామిని: భామినిలోని ఉమారామలింగేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి చక్రతీర్థ స్నానం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను మేళతాళాలతో ఊరేగించి వంశధార నదికి తీసుకెళ్లారు. ఆలయ అర్చకులు రవిమహరణ ఆధ్వర్యంలో వేద మంత్రాలతో విగ్రహాలకు శుద్ధిస్నానం చేశారు. నదిలో స్నానం చేసేందుకు భక్తులు పోటీపడ్డారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సంతర్పణ నిర్వహించారు.

హైకోర్టు మార్గదర్శకాలు అమలయ్యేనా?

- గిరిజన ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై సందిగ్ధత
- జీవో నెంబర్-3 అమలుపై అనుమానం
- కొత్త పద్ధతిలో భర్తీ చేసేందుకు అధికారులు సన్నద్ధం
- పాత విధానం అమలు చేయాలంటున్న గిరిజన అభ్యర్థులు



గిరిజన విద్యా రంగ సమస్యలపై ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు (ఫైల్)

సీతంపేట, మార్చి 7: ఎన్నికల వేళ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల డీఎస్సీ-2024 నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే, గిరిజన ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రకటించక పోవడంపై గిరిజన అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. గిరిజనుల కోసం స్పెషల్ నోటిఫికేషన్ ఇచ్చే ఆలోచన గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం చేయక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ప్రకారం సీతంపేట ఐటీడీఏ పరిధిలో 85 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీనికి సంబంధించి మార్గదర్శ కాలు జారీ చేసినప్పటికీ గిరిజన అభ్యర్థుల్లో మాత్రం సందిగ్ధత నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం సాధారణంగా నిర్వహించే డీఎస్సీ ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వర్గాల టీచర్ పోస్టులను భర్తీ చేస్తుంది. వీటిలో గిరిజనులకు ఏడు శాతం రిజర్వేషన్ ఉంది. అయితే, గతంలో ఐదో షెడ్యూల్డ్ ప్రాప్తికి ఏజెన్సీ అభ్యర్థులకు స్పెషల్ డీఎస్సీని ప్రకటించేవారు. గిరిజన ప్రాంతాల్లో బీఎడ్, డీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో నేరుగా పోస్టులన్నీ (శతశాతం) వారితోనే భర్తీ చేసేవారు. ప్రస్తుతం ఆ విధానాన్ని ఎత్తివేసి సాధారణ డీఎస్సీ ద్వారా నియామకమైన అభ్యర్థులకు ఉపాధ్యాయులుగా అవకాశం కల్పిస్తున్నారు. 2019 తర్వాత జీవో నెంబర్-3ను తొలగిస్తూ వైసీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. డీఎస్సీకి ఎంపికైన గిరిజన అభ్యర్థులను ఖాళీలను బట్టి ఐటీడీఏ పరిధిలో ఎక్కడైనా నియామకాలు చేపట్టవచ్చునని మార్గదర్శకాలు జారీ చేసింది. దీనిపై ఇటీవల గిరిజన నిరుద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. గతంలో మాదిరిగానే ఐదో షెడ్యూల్డ్ ప్రాప్తికి గిరిజన ప్రాంతాల్లోని ఉపాధ్యాయ పోస్టులను గిరిజన అభ్యర్థులతోనే భర్తీ జరిగేలా చూడాలని హైకోర్టును కోరారు. దీనిపై హైకోర్టు సానుకూలంగా స్పందించింది. ఐదో షెడ్యూల్ ప్రాప్తికి గిరిజన ప్రాంతాల్లో ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలోనే నియామకాలు చేపట్టాలని మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే ఇవి ఏ మేరకు అమలవుతాయనే ఆందోళన గిరిజన అభ్యర్థుల్లో నెలకొంది. ఇప్పటికే కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా జీవో నెంబర్-3 ప్రాప్తికి ఇతర కులాలకు చెందిన అభ్యర్థులను ఏజెన్సీ ప్రాంతాల్లో నియమించారు. ప్రస్తుతం సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఖాళీగా ఉన్న 85 ఉపాధ్యాయ పోస్టులను కొత్త విధానంలో భర్తీ చేసేందుకు అధికారులు సిద్ధమవుతుండడంతో గిరిజన అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. పాత పద్ధతిలోనే పీవో ఆధ్వర్యంలో పోస్టుల భర్తీ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు అన్నదొర మాట్లాడుతూ.. పాత పద్ధతిలో భర్తీకి సంబంధించి ప్రభుత్వం నుంచి తమకు ఎటువంటి మార్గదర్శకాలు రాలేదని తెలిపారు.

ఇసుక దందా

- జిల్లాలో జోరుగా తవ్వకాలు
- అనుమతులు లేకుండా రవాణా
- వే బిల్లుల కంటే అధికంగా వసూలు
- పట్టించుకోని అధికారులు

పార్వతీపురం-ఆంధ్రజ్యోతి/కొమరాడ

జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. దీనివెనుక అధికార పార్టీ నాయకుల హస్తం ఉండడంతో అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం వేగావతి, నాగావళి, సువర్ణముఖి నదులతో పాటు పెద్దగెడ్డలో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మొత్తం 30 రీచ్‌ల్లో తవ్వకాలకు ప్రతిమ సంస్థ అనుమతులు పొందింది. ఇందులో సీతానగరం మండలంలోని పనుకుపేట, పెద్దంకలాం, బూర్జ, పెద్దభోగిలి, లక్ష్మీపురం, చిన్నభోగిలి, పెద్దింపేట, నారాయణపురం, కొమరాడ మండలంలోని దుగ్గి, శిఖవరం, కోటిపాం, గంగేరుగువ్వలస, నాగూరు, గరుగుబిల్లి మండలంలోని మరుపెంట, సంతోష్‌పురం, పాచిపెంట మండలంలోని కర్రివలస, పాంచాలి, మోసూరు, మోత్‌మూరు, సాలూరు మండలంలోని హరిజనపేట, గుమడాం, పారన్నవలస, నెల్లిపర్తి, శివరాంపురం, దుగ్గిసాగరం, మామిడిపల్లి, కందులపదం, మక్కువ మండలంలోని డి.శిర్లాం రీచ్‌లు ఉన్నాయి. అయితే, కొమరాడ మండలంలోని కోనేరు రామభద్రాపురం రీచ్‌లో అనుమతులు లేకపోయినా గతం వారం రోజులుగా భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. వే బిల్లులు ఇచ్చి మరీ వందలాది ట్రాక్టర్లకు ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తూ కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారు. ఈ వే బిల్లులు ప్రతిమ సంస్థ పేరుతోనే ఉన్నాయి. అధికారికంగా వే బిల్లులు ఇస్తున్న దానికంటే రూ.225 అధికంగా వసూలు చేస్తున్నారు. ఈ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్తుందో తెలియడం లేదు. గతంలో కోనేరు రామభద్రాపురం వద్ద నాగావళి నుంచి జేపీ సంస్థ ఇసుక రవాణా చేస్తుండేది. ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన దానికంటే అధికంగా ఇసుక తవ్వకాలు చేపట్టి ఆ సంస్థ కోట్లాది రూపాయలు దోచుకుందనే ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీకి చెందిన కొంత మంది నాయకులకు, అధికారులకు కూడా వాటాలు వెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమ రవాణాను అడ్డుకునేందుకు కొమరాడకు చెందిన కొందరు నాయకులు ప్రయత్నించగా ఓ నియోజకవర్గ స్థాయి నాయకుడు వారిని హెచ్చరించాడు. దీంతో ఆ నాయకులు మౌనం వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక తహసీల్దార్ ఇసుక అక్రమ రవాణాను నివారించేందుకు ప్రయత్నిస్తే ఆయన్ను ఆ మండలం నుంచి బదిలీ చేశారు. కేవలం కొమరాడ మండలంలోనే కాకుండా పాలకొండ, భామిని, సీతానగరం మండలాల్లో నదుల నుంచి ఇసుక అక్రమ రవాణా పెద్ద ఎత్తున జరుగుతుంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.



కోనేరు రామభద్రాపురం రీచ్ వద్ద ప్రతిమ కన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరిట జారీ చేస్తున్న వే బిల్లులు



ఇసుక అక్రమ రవాణాలో ట్రాక్టర్లు



అక్రమంగా ఇసుకను తరలిస్తున్న భారీ వాహనాలు

సమాచారం లేదు..

కొమరాడ మండలం కోనేరు రామభద్రాపురం వద్ద ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్టు మా దృష్టికి రాలేదు. ఆ ప్రాంతంలో ఇసుక రీచ్ మంజూరుపై కూడా ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి సమాచారం లేదు.

-శ్రీనివాసరావు, ఏడీ, మైన్స్ డిపార్ట్‌మెంట్

కలెక్టర్ వద్దకు వెళ్లండి..

ఇసుక రవాణాకు సంబంధించి ప్రతిమ సంస్థ ప్రతినిధి మహేష్‌ను ప్రశ్నించగా.. కోనేరు రామభద్రాపురం ఇసుక రీచ్‌కు అనుమతులు ఉన్నాయో లేదో కలెక్టర్ వద్దకు వెళ్లి పరిశీలించుకోండి అని దురుసుగా సమాధానం ఇచ్చాడు.



ఇసుక తవ్వుతున్న యంత్రం

అక్కడ అరకొర.. ఇక్కడ నిండుగా..


- నాగావళి, జంఝావతి కాలువల్లో నీటి ప్రవాహ తీరిది..
- తారుమారైన పరిస్థితి..
- నదీ తీర ప్రాంత వాసులు, రైతులకు తప్పని ఇబ్బందులు

గరుగుబిల్లి, మార్చి 7

నిండుకుండలా దర్శనమిచ్చే జీవనది నాగావళిలో నీటి నిల్వలు తగ్గు ముఖం పట్టాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రవాహ జోరు తగ్గింది. ఎండల తీవ్రత పెరగడం, పై ప్రాంతం ఒడిశాలోనూ పెద్దగా వర్షాలు కురవకపోవడంతో నది పరిధిలో తోటపల్లి రెండు కాలువల నుంచి సాగు, తాగునీరు అంతంత మాత్రంగానే సరఫరా అవుతోంది. దీంతో తీర ప్రాంత వాసులు, రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏటా ఖరీఫ్ సమయానికి తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నది నిండుగా ఉండేది. జంఝావతి నుంచి అరకొరగా నీటి సరఫరా అయ్యేది. అయితే ఇప్పుడు పరిస్థితి తారుమారు అయ్యింది. ప్రస్తుతం నాగావళి పరిధి తోటపల్లి ప్రాజెక్టులో 105 మీటర్లకుగాను 102.96 మీటర్ల మేర నీరు నిల్వ ఉంది. పైనుంచి నదిలోకి 236 క్యూసెక్కులు రాగా, దిగువ ప్రాంతాలకు 140 క్యూసెక్కులు, కుడి, ఎడమ ప్రధాన కాలువల నుంచి 20 క్యూసెక్కులను తాగునీటి అవసరాల నిమిత్తం సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టులో రోజు రోజుకూ నీటి నిల్వలు తగ్గుముఖం పట్టడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. మరికొద్ది రోజుల్లో వర్షాలు కురవకుంటే ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వలు మరింతగా తగ్గనున్నాయని చెబుతున్నారు. జంఝావతికి సంబంధించి పైనుంచి 100 క్యూసెక్కులు వస్తుండగా, దానిని అధికారులు యథావిధిగా కిందకు విడుదల చేస్తున్నారు. దీంతో జంఝావతి కాలువలు నిండుగా దర్శనమిస్తున్నాయి.



నాగావళి నదిలో అంతంత మాత్రంగానే ఉన్న నీరు



జంఝావతి కాలువ నుంచి సాగునీరు విడుదల చేసిన దృశ్యం



దత్తిరాజేరు మండలంలో గజపతినగరం బ్రాంచి కాల్వను తవ్వేసి రోడ్డు వేసిన దృశ్యం

గట్టు చదును చేసి.. రోడ్డుగా నమ్మించేసి

దత్తిరాజేరు మండలం కన్నాం గ్రామం నుంచి పెదకాద వెళ్లే మార్గమిది. ఇప్పటికే ఈ రెండు గ్రామాల మధ్య లింక్ రోడ్డు ఉంది. అయితే వచ్చిన గ్రాంటును ఏదోలా పనులు చూపించి బిల్లులు చేయించుకునేందుకు నాయకులు పథకం పన్నారు. ఆ ప్రకారం కావాలనే రోడ్డును ప్రతిపాదించారు. తోటపల్లి-గజపతినగరం సాగునీటి బ్రాంచి కాల్వ కోసం భూ సేకరణ చేసిన స్థలంలో గట్టును చదును చేసేసి రోడ్డుగా మార్చేశారు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో బిల్లులు నిలిచిపోయినట్లు సమాచారం.

-దత్తిరాజేరు

రాష్ట్రంలో అసమర్థ పాలన

- తెలుగుదేశం పార్టీ నాయకుల ధ్వజం
- బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం

రాష్ట్రంలో సీఎం జగన్ అసమర్థపాలన సాగిస్తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. గురువారం జిల్లాలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. పలుచోట్ల వైసీపీ నాయకులు టీడీపీలోచేరారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి: అదితి

విజయనగరం రూరల్: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని విజయనగరం నియోజకవర్గ టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతి రాజు ఆరోపించారు. నగర పాలక సంస్థ పరిధిలోని 14వ డివిజన్‌లోని కొత్త పేట శుద్దవీధి, పులిగెడ్డవారు వీధి, చెరువు గట్టు తదితర ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. మాజీ కౌన్సిలరు మద్దాల జగదాంబ, డివిజన్ ఇన్‌చార్జి మద్దాల నాగమ్మ, జనసేన నాయకులు చక్రవర్తి, శ్రావణి పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి: నాగార్జున

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని ఆ పార్టీ టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జునతోపాటు పలువురు నాయకులు తెలిపారు.ఈ మేరకుటీడీపీ-జనసేన రాష్ట్ర కమిటీలు మంగళగిరిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌పై హర్షం వ్యక్తం చేశారు. విజయనగరం అశోక్ బంగ్లాలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున, పార్టీ విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజుతో పాటు, టీడీపీ బీసీ విభాగం నాయకులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి అదితి గజపతిరాజు మాట్లాడు తూ బీసీలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లే లక్ష్యంతో టీడీపీ-జనసేన బీసీ డిక్లరేషన్‌ని విడుదల చేశాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, ప్రసాదుల ప్రసాద్, కంది మురళీ నాయుడు, కోండ్రు శ్రీనివాసరావు, పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, గదుల వెంకటరావు, చోడి ఆదినారాయణ పాల్గొన్నారు.

100 కుటుంబాలు టీడీపీలో చేరిక

రాజాం: టీడీపీ అధికారంలోకి వస్తే చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రి అయితే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి, రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ తెలిపారు. రాజాంలో జరిగిన వేర్వేరు కార్యక్రమాల్లో 100 కుటుంబాలు టీడీపీలో చేరాయి. తొలుత మునిసిపాలిటీలోని ఈశ్వరనారాయణ కాలనీకి చెందిన అల్లేన మురళీకృష్ణ, తోనంగి హారిక తదితర 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈశ్వరనారాయణ కాలనీ, బాబానగర్‌ల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో రేగిడి మండలంలోని సంకిలికి చెందిన 20 ఎస్సీ కుటుంబాలు, బీసీ యాదవులు 40 కుటుంబాలు, బూరాడ గ్రామానికి చెందిన 20 బీసీ కుటుంబాలు టీడీపీలో చేరాయి వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కోండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ సీఎం అసమర్థ పాలనతో రాష్ట్రం సర్వనాశనం అయ్యిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు పొట్నా చిట్టిబాబు, నంది సూర్యప్రకాష్‌రావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, శాసపు రమేష్‌కుమార్, వంగా వెంకటరావు, గురవాన నారాయణరావు, జరజాన నీలయ్య, పిల్ల సత్యంనాయుడు, టంకాల కన్నంనాయుడు, కుమరాపు నీలకంఠం నాయుడు, యాగాటి భాను ప్రకాష్, బూరి గోవిందరావు, చిందిరాల అప్పల స్వామి, కిరణ్, గెంబలి కృష్ణ, గెంబలి సింహాచలం పాల్గొన్నారు.● **వంగర:** మండలంలోని రాజులగుమ్మకు చెందన వంశీ, అప్పలనాయుడుతో పాటు పలువురు వైసీపీని వీడి నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రుమురళి మోహన్ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొత్స వాసుదేవరావునాయుడు, మోహనరావు, ఎల్.కృష్ణమూర్తి, ధనలక్ష్మి శ్రీనివాస్, రవి, ధనలక్ష్మి, నారాయణరావు, వంగా వెంకటరావు, జైరాం పాల్గొన్నారు.

పాములవలస, పాతరేగ గ్రామస్థులు టీడీపీలో చేరిక..

బొబ్బిలి: తెర్లాం మండలంలోని పాములవలసకు చెందిన 20 కుటుంబాలు, రామభద్రపురం మండలంలోని పాతరేగ నుంచి 40 కుటుంబాలు బొబ్బిలి దర్బారు మహల్‌లో టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు సమక్షంలో టీడీపీలో చేరాయి. పాములవలసకు చెందిన ఉపసర్పంచ్ పుట్టపు లక్ష్మి, సత్యనారాయణ ఆధ్వ ర్యంలో గ్రామానికి చెందిన బత్తుల సురేష్, పుట్టపు వెంకటరమణ, సన్యాసి రావు, నరసింహారావు, రాంబాబుకాళ్ల సూర్యనారాయణ, తౌడు, సింహాద్రి తదితర 20 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ తెర్లాం మండలాధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయు డు, వెంకటేష్, రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి అమరాపు సురేష్ పాల్గొన్నారు. అలాగే రామభద్రపురం మండలంలోని పాతరేగ నుంచి 40 కుటుంబాల వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి.గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు లోకారపు నాయనప్ప, మార్పిన ముత్యాలు, గొట్టాపు సన్యాసినాయుడు, లక్ష్మునాయుడు, పెద్దింటి చిన్నంనాయుడు, సబ్బారపు తాతబాబు, గిరిడి బిల్లి కృష్ణ, లోకారపు నాగేశ్వరరావు, సింగనపల్లి సత్యం చేరారు. కార్యక్రమం లో టీడీపీ నాయకులు మడక తిరుపతినాయుడు, పైల నాగరాజు, లోకాపు రామకృష్ణ, పార్టీ మండలాధ్యక్షుడు కరణం భాస్కరరావు పాల్గొన్నారు.



విజయనగరం రూరల్: నగర పాలకసంస్థ పరిధిలో 14వ డివిజన్‌లో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న అదితి గజపతిరాజు

బొబ్బిలిలో టీడీపీ కార్యాలయం ప్రారంభం

బొబ్బిలి ఇందిరమ్మకాలనీలో గురువారం టీడీపీ కార్యాలయాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు ప్రారంభించారు. కాలనీ నాయకులు తెర్లి రామ్మోహనరావు, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బేబీనాయన మాట్లాడుతూ ఇటీవల పార్టీలో చేరిన నాయకులతో కలిసి అందరూ సమన్వయంగా పనిచేసి ఎన్నికల్లో భారీ ఆధిక్యతను సాధించాలన్నారు. కార్యక్రమంలోటీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు సుంకరి సాయిరమేష్ పాల్గొన్నారు.



విజయనగరం రూరల్: జయహో బీసీ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు



రాజాం: టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న కోండ్రు మురళీమోహన్



బొబ్బిలి: టీడీపీలో చేరిన వారితో బేబీనాయన, తెంటు

పోక్సో కేసులో నిందితుడికి జైలు శిక్ష

బెలగాం: పోక్సో చట్టం కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ విజయనగరం కోర్టు గురువారం తీర్పునిచ్చింది. సాలూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన పెరుమల్ల రమణయ్య(50) అదే గ్రామానికి బాలిక(8)తో అసభ్యంగా ప్రవర్తించి, ఇనుపరాడ్డుతో గాయపరచాడని సాలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో 2021లో కేసు నమోదయ్యింది. పోలీసులు దర్యాప్తు చేపట్టి విచారించారు. నేరం రుజువు కావడంతో విజయనగరం కోర్టు పోక్సో చట్టం కింద నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.3వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది. బాధితురాలికి రూ.1లక్ష నష్ట పరిహారం చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చింది.

ఎం.లింగాలవలసలో చోరీ

దత్తిరాజేరు: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఎం.లింగాలవలస గ్రామంలో చోటుచేసుకుంది. పెదమానాపురం ఎస్ఐ శిరీష గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నడిపల్లి కోదండపాని తన ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి మెంటాడ మండలం మీసాలపేట గ్రామంలో జరుగుతున్న తన బంధువు వివాహం నిమిత్తం ఈనెల 5వ తేదీన వెళ్లారు. మళ్లీ గురువారం ఉదయం వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి తలుపులు తీసి ఉన్నాయి. ఇంట్లోని బీరువాలో దాచిన మూడు తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు చోరీ అయినట్లు నిర్ధారించుకుని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి పరిశీలించింది. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

17 మంది పేకాటరాయుళ్లు అరెస్టు

కొత్తవలస: మండలంలోని అప్పన్నదొరపాలెం పంచాయతీ దారపైడితల్లెమ్మ గుడి వద్ద పేకాటాడుతున్నవారిపై బుధవారం రాత్రి దాడి చేసి 17 మందిని అరెస్టుచేసినట్లు కొత్తవలస సీఐ చంద్రశేఖర్ తెలిపారు. సమాచారం మేరకు దాడులను నిర్వహించామని చెప్పారు. ఈ మేరకు 17 మందిపై కేసునమోదు చేసి అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదలచేశామని తెలిపారు. వీరి నుంచి లక్షా 58 వేల 300 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కలెక్టరేట్ ఆడిటోరియంలో షార్ట్ సర్క్యూట్

కలెక్టరేట్: విజయనగరంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు రావడంతో సిబ్బంది ఆందోళన చెందారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళా దినోత్సవం నిర్వహణ కోసం ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో షార్ట్ సర్క్యూట్‌కావడంతో మంటల వచ్చాయి. వెంటనే అక్కడ ఉన్న సిబ్బంది గమనించి అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సమస్యను గుర్తించి సరిచేసిన తర్వాత విద్యుత్ పునరుద్ధరించారు. దీంతో కార్యక్రమానికి హాజరుకావడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా కలెక్టరేట్ సముదాయంలో ఎక్సైజ్ కార్యాలయం సమీపంలో పారిశుధ్య కార్మికులు చెత్తను ఒకచోట కుప్పగా ఉంచి అగ్నిపెట్టడంతోమంటలొచ్చాయి. దీంతో పైఉన్న విద్యుత్ వైర్లకు మంటలు వ్యాప్తించాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు.

పండ్ల తోటల దగ్ధం

వంగర: వీవీఆర్‌పేట, నీలయ్యవలసలో బుధవారం అర్ధరాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో పండ్ల తోటలు ఆహుతయ్యాయి. అటుగా వెళ్లిన పాదచారులు సిగరెట్ తాగి విసిరేయడంతో అవి రాజుకుని మంటలు వ్యాపించి ఉంటాయని భావిస్తున్నారు. నీలయ్యవలసలో గ్రానైట్ యజమానికి చెందిన రెండు ఎకరాల మామిడి తోట, వీవీఆర్ పేటలో దత్తిఅప్పలనాయుడు, వెంకటనాయుడు, మురళికి చెందిన తోటలు దగ్ధమైనట్టు రైతులు తెలిపారు.

నీటి పథకాల వద్ద చెత్త తొలగించాలి

రాజాం: రక్షిత మంచి నీటిపథకాలు వద్ద పిచ్చిమొక్కలు, చెత్తా చెదారం తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పురపాలక సంఘం కమిషనర్ జె.నారాప్పల నాయుడు ఏఈ, సిబ్బందిని ఆదేశించారు. గురువారం రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయం సమీపంలో ఉన్న రక్షిత మంచినీటి పథకాలను పరిశీలించారు. మంచినీటి పథకాల వద్ద పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం ఉండడంతో సిబ్బందిపై మండిపడ్డారు. యంత్రాలతో శుభ్రం చేయించారు.అక్కడ తుప్పుపట్టిన వాహనాలు తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ వెంకట్ పాల్గొన్నారు.

మహిళల కోసం ప్రత్యేక చట్టాలు రావాలి

విజయనగరం రూరల్: మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు రావల్సి ఉందని ఉపాధ్యాయ సంఘ నేత, విశ్లేషకుడు బంకపల్లి శివప్రసాద్ చెప్పారు. గురువారం విజయనగరంలోని సంఘకార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రతి మహిళా ఆర్థిక స్వాలంబన దిశగా అడుగులు వేయాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సామగ్రి ప్రారంభం

తెర్లాం: జన్నివలస అంగన్‌వాడీ కేంద్రంలో వాటర్ ప్యూరి ఫైర్, కుర్చీలు, డైనింగ్ టేబుల్, గ్యాస్‌స్టౌ ఫ్యాన్, డోర్‌మెట్స్, స్టీల్ సామగ్రిని బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, సర్పంచ్ బోడెల విజయబాబు ప్రారంభించారు. పోషణ అభియాన్ 2.0 కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు రాగిపిండి తదితర పోషకాహారాన్ని పంపిణీచేశారు. కార్యక్రమంలోఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి సత్యనారాయణ, వైస్ సర్పంచ్ మరడాన రమణ, పంచాయతీ కార్యదర్శి మీసాల స్వామి, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.

బొబ్బిలిలో శివజయంతి

బొబ్బిలి: బొబ్బిలి బ్రహ్మకుమారీస్ ఆశ్రమంలో గురువారం 88 వ త్రిమూర్తి శివ జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. సంస్థ ఇన్‌చార్జి బీకే రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ నేత బేబీనాయన పరమపిత శివప రమాత్మని పతాకాన్ని ఆవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేశారు.

జేఎన్‌టీయూలో ఈఐఎస్ఈఎస్-2024 సదస్సు

విజయనగరంరూరల్: స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో ఈనెల ఆరోతేదీన ప్రారంభమైన ఈఐఎస్ఈఎస్-2004 జాతీయ సదస్సు గురువారం ముగిసింది.ఈసందర్భంగా విభాగాధిపతి అండ్ చైర్మన్ వి.మణికుమార్ మాట్లాడుతూ ఇటువంటి సదస్సులతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. సదస్సుకు హాజరైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎ.శ్రీనివాసులు, కిషోర్‌నాథ్, ఎం.శ్రావ్య, ఎస్.రెడ్డి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు చేయాలి

రామభద్రపురం: త్వరలో జరగనున్న ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ ఆకుల సులోచనారాణి సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలు, రూట్ ఆఫీసర్లు, సెక్టార్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ వద్ద విద్యుత్, తాగునీటి సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో హెచ్‌డీటీ సుబ్బారావు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

విజయనగరం దాసన్నపేట: విద్యార్థులుచదువుతోపాటు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు కోరారు. గుంటూరు జిల్లాలోని చిలకూరిపేటలో ఇటీవల జరిగిన 36వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థులు పతకాలు సాధించడంతో గురువారం విజయనగరంలో వారికిఅభినందించారు. ఈసందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడా రంగంలో దూసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో ఏబీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎంఎస్ స్వరూప్, సుమన్, సతోఖాన్, పెంకి అశ్విని, గౌరీశంకర్, కె శ్రీనివాసరావు, శివకృష్ణ, రమణ, పాంద్రంకి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

తీర్మానంతో ఆశావర్కర్ పోస్టు భర్తీచేయాలి

రామభద్రపురం: నర్సాపురంలో ఆశావర్కర్ పోస్టును రాజ్యాంగ బద్ధంగా పంచాయతీ తీర్మానంతో భర్తీ చేయాలని టీడీపీ నాయకుడు, నర్సాపురం సర్పంచ్ కోట వెంకటనాయుడు కోరారు.గురువారం రామభద్రపురంలో విలేకరులతో మాటాడుతూ వైసీపీప్రభుత్వంలో సర్పంచ్‌లకు ఎటువంటి విలువలు ఇవ్వారా అని ప్రశ్నించారు. సర్పంచ్‌లకు ఏవిధమైన అధికారాలులేకుండా అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీపీలు వ్యవహరించడం సమంజసమేనా అని నిలదీశారు. ఇప్పటికే గ్రామాల్లో వైసీపీ కార్యకర్తలు ఇష్టారాజ్యంగా ప్రజాధనాన్ని దోచుకోవడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా చిన్నచిన్న పోస్టులు భర్తీ చేసుకుంటున్నారని ఆరోపించారు. నర్సాపురంలో ఆశావర్కర్ పోస్టు భర్తీ విషయంలో నిబంధనలు తుంగలో తొక్కి అర్హతలు లేకపోయినా ఎమ్మెల్యే సూచించిన వారికే ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇటువంటి విధానం గత ప్రభుత్వంలో లేదని, అధికారపార్టీ నాయకుల పేరుచెప్పుకుని కార్యకర్తలు గ్రామాల్లో దందాలు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో తెలుగు మహిళ మరిపి గౌరీశ్వరి పాల్గొన్నారు.

అవినీతిపై వాడీవేడి చర్చ

- బొబ్బిలి మునిసిపాలిటీలో ధ్వజమెత్తిన టీడీపీ కౌన్సిలర్లు
- వాటర్‌వర్క్స్‌పై కమిటీ ఏర్పాటుచేయండి: కౌన్సిలర్ రాంబార్కి
- భూకబ్జాలపై ఉద్యమం చేస్తా: వైస్‌చైర్మన్

బొబ్బిలి: బొబ్బిలి మునిసిపాలిటీలో అవినీతిలో వాడివేడి చర్చ జరిగింది. ఇక్కడ అవినీతి కార్యకలాపాలు పెచ్చుమీరిపోయాయని టీడీపీ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. గురువారం మునిసిపల్ చైర్మన్ సావు వెంకటమురళీ కృష్ణారావు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు సమక్షంలో ఎనిమిదో వార్డు టీడీపీ కౌన్సిలరు రాంబార్కి శరత్‌బాబు పలు అంశాలపై అధికారులను నిలదీశారు. వాటర్‌వర్క్స్‌లో అవినీతి పేరుకుపోయిందని, ప్రతి కౌన్సిల్‌లో వాటర్‌వర్క్స్ నిర్వహణకు లక్షలాది రూపాయలను జనరల్‌ఫండ్ నుంచి వెచ్చిస్తున్నట్లు తీర్మానాలు చేస్తున్నారని, తాగునీటి సరఫరా అత్యవసర పనుల కోసమని చెప్పడంతో కౌన్సిల్ కూడా కిమ్మనకుండా ఆమోదం తెలుపుతోందని ప్రశ్నించారు. ఇదేఅదనుగా ఇష్టారాజ్యంగా నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నటు ఆరోపించారు. పట్టణంలోని పలు వార్డుల్లో వేసిన రోడ్లు ఆరునెలల వ్యవధిలోనే పూర్తిగా పాడైపోయాయని, క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఈవిషయంపై ఏఈలు రవి, సురేష్ మాట్లాడుతూ రోడ్లపై ఫినిషింగ్ మాత్రమే చూపవద్దని, రోడ్డు బలాన్ని పరిగణిం చాలన్నారు.అయితే శరత్‌బాబు, ఫ్లోర్‌లీడరు గెంబలి శ్రీనివాసరావు, వెలగాడ హైమావతి సంతృప్తి చెందకపోవడంతో చైర్మన్ కలుగజేసుకొని క్వాలిటీ కంట్రోల్ పనితీరు బాగోలేదని,అందుకే ఆ ఏజెన్సీని మార్చుతున్నట్లు తెలిపారు. షాపింగ్‌కాంప్లెక్స్‌ల్లో షాపుల కేటాయింపు, అద్దె బకాయిల వసూళ్లపై అధికారులు చూపుతున్న నిర్లక్ష్యంపై శరత్‌బాబుతోపాటు ఇంటిగోవిందరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.గతంలో వాయిదావేసిన అంశాన్ని మళ్లీ అలాగేచేర్చారని, అద్దె బకాయిలను సామాన్యుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారని, షాపుల లీజుల దారుల నుంచి ఎందుకు వసూలు చేయడంలేదని ప్రశ్నించారు. వాటర్‌వర్క్స్, షాపింగ్‌కాంప్లెక్స్‌లపై ఓ కమిటీని ఏర్పాటు చేయాలని రాంబార్కి, ఇంటి డిమాండ్ చేశారు.దీనికిబొత్స రమణమ్మ, చోడిగంజి రమేష్‌నాయుడు, పాలవలస ఉమా శంకర్ మద్దతుపలికారు. ఇందిరమ్మకాలనీలో అక్రమాలపై ఇంటి గోవిందరావు నిలదీశారు. ఇళ్లస్థలాలు పెద్దఎత్తున కబ్జా జరగుతున్నాయని, ఆ కాలనీలో ఆరుగురు అజమాయిషీచేస్తున్నారని, ఇందులో విలేకరులపాత్ర కూడా ఎక్కువగా ఉందని ఆరోపించారు. వైస్‌చైర్మన్ చెలికాని మురళీకృష్ణ మాట్లాడుతూ బొబ్బిలిలో ప్రభుత్వస్థలాల ఆక్రమణలపై ఉద్యమంచేస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు మాట్లాడుతూ మునిసిపాలిటీలో కౌన్సిలర్లంతా వ్యక్తంచేస్తున్న ఆవేదనను చూస్తుంటే అధికారుల పర్యవేక్షణ సక్రమంగాలేనట్లుగా అనుమానంగాఉందని, ఆరోపణలుచేస్తున్న అంశాలపై కమిటీలు వేసి నిగ్గుతేల్చాలన్నారు. ఒక వేళ ఎక్కడైనా అవినీతి జరిగినట్లు నిరూపిస్తే సంబంధిత అధికారులపై గట్టి చర్యలు తీసుకుం టామన్నారు.ఈ టర్మ్‌కి నాకు ఇదే ఆఖరి సమావేశమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీఆదరించి తనను గెలిపిస్తే కౌన్సిల్‌లోకి అడుగుపెడతానని చెప్పారు. తరువా త కూడా కౌన్సిలర్లు పలు వార్డు సమస్యలు, అక్రమాలపై అధికారులను నిలదీ శారు. టీడీపీ కౌన్సిలర్లు దాసరి సురేష్, కాకల గోవిందమ్మ, వెలగాడ హైమావతి తమ వార్డుల్లో సమస్యలపై ప్రశ్నించారు.సమావేశంలో కమిషనరు లాలంరామలక్ష్మి, ఆర్వోప్రసాదరావు, సురేష్‌బాబు, ఆర్ఐ త్రినాథ, టీపీఓ వరప్రసాద్, టీపీఆర్ఓ వరప్రసాద్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు సోమేశ్వరరావు పాల్గొన్నారు.



మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో నిలదీస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

11న అప్రెంటీస్ మేళా

కొత్తవలస: విజయనగరంలో వీటీ అగ్రహారంలోగల ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 11న అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి ఎస్.భీమ శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు మేళాకు హాజరుకావచ్చని తెలిపారు. ఎంపికైన వారికి ఆయా పరిశ్రమల్లో ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు స్టయిఫండ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

'ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యం'

విజయనగరం దాసన్నపేట: ఉత్తరాంధ్ర అభివృద్దే పార్టీ లక్ష్యమని ఉత్తరాంధ్ర ప్రజాపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ ఆనందసాగర్ తెలిపారు. గురువారం విజయనగరం ఉడాకాలనీలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్రలో పార్టీ తరపున పోటీచేసే ఆసక్తి గల అభ్యర్థులకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మందపాటి వాసురాజు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

358 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

లక్కవరపుకోట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని 31 పంచాయతీలకు చెందిన 358 మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల పట్టాలను గురువారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జడ్పీటీసీ టి.వరలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యానశాఖాధికారిగా ఉమాభరణి

విజయనగరం రింగురోడ్డు: స్థానిక నగరపాలక సంస్థ ఉద్యానశాఖాధికారిగా బి.ఉమాభరణి గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఈమేరకు కమిషనర్ మల్లయ్యనాయుడిను కలిశారు. పాయకరావుపేటలో ఉద్యానశాఖ అధికారిగా సేవలందించి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం

కొత్తవలస : మండలంలోని తుమ్మికాపల్లి రైల్వేగేట్ సమీపంలో షిరిడీసాయి బాబా ఆలయ 24వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు పీఠం వ్యవస్థాపకుడు అంపోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరిగాయి.

చేయూత నిధులు విడుదల

కలెక్టరేట్: వైఎస్ఆర్ చేయూత నిధులను సీఎం జగన్ విడుదల చేసినట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆన్‌లైన్‌లో ద్వారా ఆనకాపల్లి నుంచి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇక్కడి నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నాగలక్ష్మి మాట్లాడుతూ ఒక్కో మహిళకు రూ.18,750 చొప్పున 1,43,280 మంది రూ.268.65 కోట్లు అందుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్‌చక్రవర్తి, మెప్మాపీడీ సుధాకర్, గ్రామవార్డు సచివాలయం సమన్వయ అధికారి నిర్మలాదేవి పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది తీరు దారుణం

శృంగవరపుకోట రూరల్: తమసచివాలయ సిబ్బంది తనకు కనీస విలువ ఇవ్వడంలేదని సర్పంచ్ ఆడారి మహేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం గోపాలపల్లి పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన గ్రామసభ వద్ద ఆయన మాట్లాడుతూ తాను ఎప్పుడు గ్రామసభ ఏర్పాటుచేస్తానని చెప్పినా వారు ఉండడం లేదన్నారు. పంచాయతీ కార్యాలయానికి వచ్చి సంతకాలు చేసి వెళ్లిపోతున్నారని...దీనివల్ల అనేకసార్లు గ్రామసభలు రద్దు చేశామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేద్దామనుకుంటే సచివాలయ సిబ్బంది సహకరించకపోవడం మనోవేదనకు గురిచేస్తోందన్నారు. సచివాలయ సిబ్బంది తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని సర్పంచ్, వార్డు సభ్యులు తెలిపారు.

రాత్రి వేళల్లో గ్రావెల్ తరలింపు

శృంగవరపుకోట రూరల్: ధర్మవరంలో గ్రావెల్ మాఫియా తమకు నిద్రలేకుండా చేస్తోందని స్థానికులు వాపోతు న్నారు. గురువారం ఎస్సీ కాలనీవాసులు, యాతపేట వాసులు మాట్లాడుతూ గడిచిన రెండు రోజులుగా స్థానిక దెయ్యాలమెట్ట నుంచి రూ.లక్షల విలువ చేసే గ్రావెల్‌ను రాత్రివేళల్లో అక్రమంగా తరలిస్తున్నారనితెలిపారు. తాము ఆపి ప్రశ్నిస్తే... తిరిగి బెదిరిస్తున్నారని వాపోయారు. వేసవి కాలం కావడంతో బయట నిద్రిస్తున్న తమపై బుగ్గి వెదజల్లుతున్నారని.. దీని వల్ల ఆరోగ్యాలు పాడవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ కిరణ్ కుమార్‌ను వివరణ కోరగా... దీనిని పరిశీలించి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

వైసీపీ పాలనలో వైద్యంపై నిర్లక్ష్యం

- శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న లలితకుమారి

కొత్తవలస: వైసీపీ పాలనలో వైద్య సదుపాయాలపై నిర్లక్ష్యం చేసిందని శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి ఆరోపించారు. గురువారం కొత్తవలసలోని పార్టీ కార్యాలయం ఆవరణలో ఎన్టీఆర్ సేవాసమితి ట్రస్టు, ఎంవీవీఎస్ మూర్తి ట్రస్టు సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించాయి.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు-నేడు పనులంటూ ముందుగా ఉన్న వైద్యశాలలను పడగొట్టారని, కొత్తవి కట్టడానికి నిధులు మంజూరు చేయకపోవడంతో పునాదుల దశలోనే నిలిచిపోయాయని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలు అద్దె భవనాల్లోనే ఉన్నాయన్నారు. ఆసుపత్రులకు అవసరమైన బడ్జెట్ కేటాయించకపోవడంతో సరైన మందులు కూడా లేవన్నారు. విశాఖకు చెందిన గీతం వైద్యశాల, జీమ్‌సర్ వైద్యశాలల వివిధ విభాగాలకు చెందిన వైద్యులు 400 మందికి వివిధ రకాల వ్యాధులకు సంబంధించి తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో టీడీపీనాయకులు కేబీఏ రాంప్రసాద్, శ్రీను,బొబ్బిలి అప్పా రావు, కనకాల శివ, బంగారు రమేష్, రత్నాజీ, నక్కరాజు చిన రాము పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నమూనాల సేకరణపై శిక్షణ

విజయనగరం రింగురోడ్డు: జిల్లా క్షయ నివారణ కేంద్రం, ఫౌండేషన్ ఫర్ ఇన్నోవేటివ్ న్యూ డయోగ్నోస్టిక్ సర్వీసెస్ సంయుక్తంగా టీబీ ఇంప్లిమేంటేషన్ ఫ్రేం వర్క్ అగ్రిమెంటులో భాగంగా గురువారం ఓప్రైవేటు హోటల్‌లో చిన్నపిల్లల్లో క్షయ వ్యాధికి సంబంధించిన నమూనాల సేకరణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో పట్టణ, ప్రాథమిక కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు,సిబ్బంది పాల్గొన్నారు. ఈసందర్భంగా డీఎంహెచ్ఓ భాస్కరరావు మాట్లాడుతూ చిన్నపిల్లల్లో క్షయని గుర్తించడానికి ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు అవసరమన్నారు. ఆసుపత్రి సమన్వయ అధికారి డాక్టర్ గౌరీశంకరరావు మాట్లాడుతూ ప్రతి సీహెచ్‌సీలో చిన్నపిల్లలకు క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధి నివారణాధికారి డాక్టర్ రాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ చంద్రదేవ్ వర్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంకిలిలో 52 మద్యం సీసాలు స్వాధీనం

రేగిడి: మండలంలోని సంకిలిలో గురువారం రాత్రి 52 మద్యం సీసాలు స్వాధనం చేసుకునిసీజ్‌చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితుడు గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తుండగా పట్టుకుని కేసునమోదుచేసినట్లు చెప్పారు.

తప్పులు ఎత్తి చూపినందుకే డీఈఈ బదిలీ

- బొబ్బిలి టీడీపీ పట్టణాధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు



ఏడాదిగా వినియోగించని పరికరాలను పరిశీలిస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

బొబ్బిలి: మునిసిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను వేలెత్తి చూపారన్న అక్కసుతో డీఈఈని కొద్ది రోజులకే ఇక్కడ నుంచి బదిలీ చేయించారని టీడీపీ పట్టణాధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, కౌన్సిలర్లు ఆరోపించారు. గురువారం స్థానిక మునిసిపల్ తాగునీటిరిజర్వాయర్ ప్రాంగణంలో వృథాగా పడిఉన్న లక్షలాది రూపాయల విలువ చేసే వాల్వ్‌లను వారు విలేకరులకు చూపించారు. ఈ సందర్భంగా శరత్‌బాబు మాట్లాడుతూ రెండునెలల కిందట మునిసిపల్ డీఈఈగా చేరిన కనకరాజును ఆగమేఘాల మీద ఇక్కడ నుంచి ఈఅండ్‌సీ కార్యాలయానికి పంపించడం వెనుక మతలబు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. గతఏడాది మార్చిలో ఒక్కక్కటి 1.06 లక్షల రూపాయల విలువ చేసే ఐదు వాల్వ్‌లకు కౌన్సిల్ అనుమతి ఇచ్చిందన్నారు. కిర్లోస్కర్ కంపెనీకి చెందిన వాల్వ్‌లకు బదులుగా కేవలం ఒక్కక్కటి 35 వేల రూపాయల విలువ చేసే లక్ష్మి కంపెనీకి చెందిన వాల్వ్‌లు మాత్రమే కొనుగోలు చేశారని, వాటిని కూడా ఏడాదవుతున్నా ఇంతవరకు వినియోగించకుండా మూలన పడేశారని ఆరోపించారు. విజిలెన్స్ విచారణ కోసం తాము డిమాండ్‌చేస్తున్నామని, లేకుంటే నేరుగా ఫిర్యాదుచేస్తామని హెచ్చరించారు. కౌన్సిలరు వెలగాడ హైమావతి మాట్లాడుతూ ప్రజల ముక్కుపిండి వసూలు చేసిన పన్నుల సొమ్ములో కోట్లాది రూపాయలను దుబారా చేస్తూ జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. వాటర్‌వర్క్స్‌లో నిధుల గందరగోళంపై దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వారి వెంట కౌన్సిలర్లు కింతలి శ్రీదేవి, దాసరి సురేష్, కాకల గోవిందమ్మ ఉన్నారు.

బస్సులు లేక..ప్రమాద ప్రమాణం

- విజయనగరంలో ఇంటర్ విద్యార్థుల అగచాట్లు



విజయనగరం (ఆంధ్రజ్యోతి): ప్రమాదమని తెలిసినా విద్యార్థులకు తప్పడంలేదు. గురువారం విజయనగరంలో ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పలు ప్రాంతాల్లో సకాలంలో కేంద్రాలకు చేరుకోవడానికి సరిపడా బస్సులులేవు. దీంతో ఎలాగైనా నిర్దేశిత సమయానికి ముందే ఆటోలు, బస్సుల్లో వేలాడి, ఒక్కో ద్విచక్రవాహనంపై ముగ్గురు, నలుగురు వెల్లాల్సివచ్చింది. సమయం మించిపోతుండడంతో కొన్నిచోట్ల ద్విచక్ర వాహనాలు నిబంధనలకు మించి వేగంతో డ్రైవ్ చేయాల్సివచ్చింది.



రోగులకు అందుబాటులో ఉండాలి

● ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో రోగులకు వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డీవీజీ శంకరరావు స్పష్టం చేశారు. సీతంపేటలో ఆయన గురువారం పర్యటించారు. హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు హాస్టళ్లలో అనారోగ్యం పాలైతే వెంటనే వారికి మెరుగైన వైద్యం అందివ్వాలని సూచించారు. టెన్త్‌క్లాస్ పరీక్షలు సక్రమంగా నిర్వహించడానికి సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. అనంతరం ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. గర్భిణులు, బాలింతలకు, బరువు తగ్గిన పిల్లలకు ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. రూ.50కోట్లతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అదేవిధంగా ఐటీడీఏ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో కల్పనాకుమారి, స్థానిక ఎమ్మెల్యే కళావతి, పాలకొండ డీఎస్పీ కృష్ణారావు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి అన్నదొర, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శ్రీనివాసరావు, సహాయ గిరిజన సంక్షేమ శాఖాధికారి మంగవేణి, ఉప విద్యాశాఖాధికారి లిల్లీరాణి, హెచ్ఎంలు ఉమావాణి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందాలి


మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు

వీరఘట్టం: ఆరోగ్య కార్యక్రమాలను పక్కాగా నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా మలేరియా అధికారి జగన్మోహన్‌రావు సూచించారు. గురువారం వీరఘట్టం, బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆశా డేలో ఆయన పాల్గొని, పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రక్తహీనత గుర్తించిన వారిని హిమోగ్లోబిన్ శాతం పెరిగే వరకు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పి.ఉమామహేశ్వరి, డాక్టర్ నితీష్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు, ఆశ వర్కర్ల పాల్గొన్నారు.

చేయూత నిధులు జమ

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: వైఎస్సార్ చేయూత పథకం నాలుగో విడత నిధులు విడుదల కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని లబ్ధిదారులకు రూ.136.60 కోట్లు విలువ ఉన్న నమూనా చెక్కును ఇన్‌చార్జి జేసీ సి.విష్ణుచరణ్ అందించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గురువారం అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసినికాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చేయూత నిధులను మీటనొక్కి నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలో జమ చేశారు. జేసీ విష్ణుచరణ్, లబ్ధిదారులు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. జిల్లాలో 72,854 మంది లబ్ధిపొందిన మహిళలకు ఒక్కొక్కరి ఖాతాలో రూ.18,750 చొప్పున మొత్తం 136కోట్ల 60లక్షల 12వేల 500 నిధులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ ప్రాజెక్టు అధికారి వై.సత్యంనాయుడు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా పోలీసు శాఖ

మక్కువ: పోలీసుశాఖ ఎల్లప్పుడూ గిరిజనులకు అండగా ఉంటుందని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అన్నారు. దుగ్గేరు గిరిజన గ్రామంలో గురువారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం తమ వంతు సహాయం అందిస్తామన్నారు. విజయనగరం నిమ్స్, శంబర పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గిరిజనులకు ఉచితంగా వైద్యం అందించి, మందులు పంపిణీ చేశారు. ఎస్పీ చేతులమీదుగా 300 మందికి దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేశారు. యువతకు వాలీబాల్ కిట్లు అందించారు. అనంతరం ఆంధ్రా, ఒడిశా సరిహద్దు, అడారు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు పరిశీలించి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సునీల్ సొరెన్, సాలూరు సీఐ జి.బాలకృష్ణ, ఎస్ఐ పి.నరసింహామూర్తి, గిరిజనులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

కురుపాం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దె దించితేనే దేశం సమైక్యంగా ఉంటుందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.తులసీదాసు అన్నారు. గురువారం కురుపాంలో సీపీఎం ఎన్నికల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సీపీఎం అభ్యర్థి పోటీ చేస్తారని, ఆ అభ్యర్థిని గెలిపించుకుని గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈనెల 8, 9 తేదీల్లో ఆదివాసీ జనరక్షణ దీక్షలు అనంతరం ఈనెల 10న గిరిజన సంఘాలు, జేఏసీ పిలుపుకు మద్దతుగా మన్యం బంద్ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుబ్బరావమ్మ, ఎం.కృష్ణమూర్తి, వేణు, మన్మథరావు, అవినాష్, రమణ, గంగునాయుడు, తిరుపతిరావు, సాంబమూర్తి పాల్గొన్నారు.

ఆయన్ని విధుల్లోకి చేర్చుకోవద్దు

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకానికి చెందిన ఓ టెక్నికల్ అసిస్టెంట్ తప్పుడు సమాచారం అందించి, విధుల్లో చేరేందుకు ప్రయత్నించాడు. గతంలో రావివలస క్లస్టర్ ప్రాంతంలో విధులు నిర్వహించిన ఆయనను నిబంధనల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేశారు. అయితే అధికార పార్టీ నేతల ఒత్తిడితో ఆయన్ని ఉన్నతాధికారులు తిరిగి పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం విధుల్లో చేరే నిమిత్తం డ్వామా పీడీ కె.రామచంద్రరావును కలిశాడు. తాను వేరే మండలానికి చెందిన వ్యక్తిగా పరిచయం చేసుకున్నాడు. ఆ తర్వాత ఆయనది గరుగుబిల్లి మండలం అని పీడీకి గురువారం తెలిసింది. దీంతో ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఏపీఎం ఎం.గౌరీనాథ్‌కు సమాచారం అందించి, ఆయన్ని విధుల్లో చేర్చుకోవద్దని డ్వామా పీడీ ఆదేశాలు జారీ చేశారు. ఆయనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి: మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వై.అమ్మన్నరావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన గురువారం సిబ్బందితో కలిసి ప్రత్యేక ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరించినట్లయితే తక్షణమే సమాచారం అందించాలన్నారు. కొద్ది రోజుల కిందట ఖడ్గవలస సముదాయంలో జరిగిన ఘటనను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నామని చెప్పారు.

గర్భిణుల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

భామిని: గర్భిణులు ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటిస్తే పుట్టబోయే శిశువులు ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి సంతోషి లక్ష్మీ పేర్కొన్నారు. గురువారం లివిరి, భామిని పీహెచ్‌సీలలో గర్భిణులకు అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రక్తహీనత ఉన్న గర్భిణులను, చిన్నారులను సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు దత్తత తీసుకొని వారి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణారావు, సీహెచ్‌వో భాస్కరరావు, అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత

వీరఘట్టం: మండల విద్యాశాఖ కార్యాలయంలో విధులు నిర్వహించి ఇటీవల అనారోగ్యంతో మరణించిన నులకజోడు సంపత్‌కుమార్ కుటుంబ సభ్యులకు హెచ్ఎంలు, ఎంఆర్‌సీలు, సీఆర్పీలు, బోధనేతర సిబ్బంది ఆర్థిక చేయూత నందించారు. చందాల రూపంలో పోగుచేసిన రూ. 3లక్షల 32 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గౌరునాయుడు, ఆనందరావు, హెచ్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

కురుపాం: ఎన్నికల సందర్భంగా కురుపాంలో గురువారం ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుపాం ఎస్ఐ షణ్ముఖరావు, పోలీసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


కురుపాంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు


కురుపాంరూరల్: డెప్పిగూడలో ప్రచారం చేస్తున్న జగదీశ్వరి


గరుగుబిల్లి: కొత్తపల్లిలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం


కొమరాడ: తమ్మన్నదొరవలసలో..

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● గ్రామాల్లో టీడీపీ బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ

● సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు అన్నారు. జిల్లాలోని పలు చోట్ల గురువారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

● **పార్వతీపురంటౌన్:** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో విజయం సాధించడం తథ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. పట్టణంలోని జగన్నాథపురం ఒకటో వార్డులో గురువారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీని ఇంటికి పంపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ●

కురుపాం రూరల్: గుజ్జువాయి పంచాయతీ పరిధిలోని డేరింగుపాడు, డెప్పిగూడ, నేరేడుమానుగూడ గ్రామాల్లో గురువారం కురుపాం తెలుగుదేశం, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థి తోయిక జగదీశ్వరి ఆధ్వర్యంలో సూపర్ సిక్స్‌పై ప్రచార కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో గుజ్జువాయి మాజీ సర్పంచ్ సుబ్బలక్ష్మి, నాగేశ్వరరావు, అడ్డాకుల నరేష్ తదితరులు పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** గ్రామాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి సాధించాలంటే టీడీపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ ప్రతినిధి గొట్టాపు లక్ష్మన్నాయుడు అన్నారు. కొత్తపల్లి గ్రామంలో గురువారం ఆయన సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. పార్టీ ప్రతినిధులు మర్రాపు శ్రీను, గంగాధర్‌నాయుడు, జి.సత్యనారాయణ, గొట్టాపు కృష్ణమూర్తినాయుడు, ఇన్‌చార్జి ఎన్.సింహాచలంనాయుడు, తదితరులు పాల్గొన్నారు. ● **సాలూరు(పాచిపెంట):** రాయిగుడ్డివలస పంచాయతీ పరిధిలో గల గిరిజన మహిళలు గురువారం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణికి ఘన స్వాగతం పలికారు. శీల, గదబవలస, ఎగువ కొత్తవలస, దిగువ కొత్తవలస గ్రామాల్లో ఆమె బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.


సాలూరు(పాచిపెంట): కొత్తవలసలో పర్యటిస్తున్న సంధ్యారాణి

టీడీపీ మేనిఫెస్టోలోగల సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు, నాయకులు ముఖి సూర్యనారాయణ, కె.సురేష్, ఇ.తిరుపతిరావు, కొత్తల పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు. ● **కొమరాడ:** తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని అరకు పార్లమెంటు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు దేవకోటి వెంకటనాయుడు అన్నారు. గురువారం విక్రాంపురం పంచాయతీ తమ్మన్నదొరవలస, నందాపురం గ్రామాల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నింటా ముందుండాలి

పాలకొండ: మహిళలు అన్నింటా ముందుండి సమాజాభివృద్ధికి దోహదపడాలని ఓని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం బలగ నాగమణి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● **గుమ్మలక్ష్మీపురం:** మహిళలే మహారాణులు అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.టి.శ్రీవరం అన్నారు. కళాశాలలో మహిళా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ వి.కల్పన ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కేదారిపురం ఎస్‌బీఐ బ్రాంచి క్యాషియర్ శిరీష ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాట్లాడారు. అనంతరం ఆమెను సత్కరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● **సాలూరు రూరల్:** మహిళ అన్నింటా ముందుండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మున్సిపల్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. తొలుత మహిళలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జరజాపు దీప్తి, మున్సిపల్ మహిళా కౌన్సిలర్లు పొంద్రంకి సన్యాసమ్మ తదితరులు, మెప్మా మహిళా సంఘాలు సభ్యులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకం


ఏఎన్ఎంలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శివకుమార్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో శివకుమార్ చెప్పారు. గురువారం గిరిమిత్ర సమావేశ మందిరంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల మరణాలను నివారించేందుకు ప్రత్యేకంగా వీరి నియామకానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అజయ్, రవికిరణ్, డి.రమణ కుమార్ పట్నాయక్, హెల్త్ కో-ఆర్డినేటర్ వినోద్, హెల్త్ ఎడ్యుకేటర్ శోభ పాల్గొన్నారు.

ఆఫ్‌లైన్‌లోనే బియ్యం ఇవ్వాలి

● కరడవలస, జిల్లేడువలస గిరిజనుల వినతి


సీఎస్‌డీటీకి వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

సాలూరు రూరల్: కరడవలస, జిల్లేడువలస పంచాయతీల గిరిజనులకు ఎప్పటిలాగే ఆఫ్‌లైన్‌లోనే రేషన్ బియ్యం అందించాలని కోరుతూ ఇరు పంచాయతీల గిరిజనులు సీదరపు అప్పారావు, బాబయ్య తదితరులు సీఎస్‌డీటీ రంగారావుకు గురువారం వినతిపత్రం అందించారు. ఆఫ్‌లైన్‌లోనే బియ్యం తెచ్చుకోవడానికి ఇరువైపుల 96 కిలోమీటర్లు వాహనం ఏర్పాటు చేసుకొని తెచ్చుకుంటున్నామన్నారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.200 పైగా ఖర్చు అవుతున్నదన్నారు. అదే ఇప్పటికిప్పుడు ఆన్‌లైన్ అయితే ప్రతిఒక్కరూ సిగ్నల్ ఉన్న ఏరియాకు వచ్చి థంబ్ వేయాల్సి ఉంటుందని చెప్పారు. ఈ ఖర్చు తడిసి మోపుడవుతుందన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని సీఎస్‌డీటీ తెలిపారు.

అందరికీ దక్కని రెగ్యులర్ ఆదేశాలు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జీవో నెంబరు-10 ప్రకారం అర్హులైన వారందరికీ రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తిస్తామని, దీనికి సంబంధించిన ఆదేశాలు జారీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మరికొన్ని రోజుల్లో ఎన్నికల కోడ్ వచ్చే పరిస్థితి ఉండడంతో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న వారికి రెగ్యులర్ ఉద్యోగులుపై ఆదేశిస్తూ నియామకాలు జారీ చేసింది. గురువారం వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న వారికి రెగ్యులర్ ఆదేశిస్తూ నియామకాలు జారీ చేసింది. అయితే ఇందులో కొన్ని పేర్లు ఉండడం, మరికొందరి పేర్లు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అర్హులందరికీ రెగ్యులర్ ఆదేశాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ నాయకుడు మురళీమోహన్‌రావు కోరారు. ఆయన గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఐటీడీఏ పరిధిలో 118 మంది సీఆర్టీలకు కేవలం 9 మందిని మాత్రమే రెగ్యులర్ ఆదేశాలు వచ్చాయన్నారు.

బీసీ డిక్లరేషన్‌తో ఎంతో మేలు


చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న దృశ్యం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: టీడీపీ అంటేనే బీసీలని.. బీసీలు అంటే టీడీపీ అని టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో చంద్రబాబుతో పాటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. బీసీ డిక్లరేషన్‌తో ఎంతో మేలు కలుగుతుందన్నారు. బీసీల పక్షపాతిగా చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ ముద్ర పడ్డారన్నారు. వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన బీసీ సామాజిక వర్గాలకు ఊరట కలిగించే విధంగా డిక్లరేషన్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను నిలదీసిన గిరిజనులు

కొమరాడ: కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి చేదు అనుభవం ఎదురైంది. గురువారం మండలంలో రహదారుల ప్రారంభోత్సవాలతో పాటు శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. శివిని గ్రామం నుంచి కురింపేటకు రహదారి నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్న సమయంలో గిరిజనుల నుంచి నిరసనను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికలు మరికొద్ది రోజుల్లో ఉన్న సమయంలో రహదారి నిర్మాణం గుర్తుకు వచ్చిందా.. అని గిరిజనులు ఎమ్మెల్యేను ప్రశ్నించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఎన్నికలకు ముందుగానే రహదారి నిర్మాణం జరుగుతుందని.. అధైర్య పడొద్దని అన్నారు.

మాతృ, శిశు మరణాలను నివారిద్దాం

● డీఎంహెచ్‌వో జగన్నాథరావు

పార్వతీపురం రూరల్: సమష్టి కృషితో మాతృ, శిశు మరణాల నివారిద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.జగన్నాథరావు అన్నారు. వెలుగు కార్యాలయంలో ప్రిజమ్10పై నిర్వహించిన మండల మహిళా సమాఖ్య సమన్వయ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పాల్గొని పలు సూచనలు చేశారు. శిశు మరణాలు రేటు, రక్తహీనత నివారణ లక్ష్యంగా ప్రిజం-10 ప్రాజెక్టు ద్వారా జిల్లా వ్యాప్తంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సచివాలయాల పరిధిలో రక్తహీనత ఉన్న గర్భిణీ, బాలింతలు, కిశోర బాలికల వివరాలు, పౌష్టికాహార లోపం ఉన్న పిల్లల వివరాలు ఇచ్చామన్నారు. వైద్య, సచివాలయ, స్వయం సహాయక సంఘాలు, శిశు సంక్షేమ శాఖ, వెలుగు, మహిళా సమాఖ్య శాఖల నుంచి నియమించిన అడాప్షన్ అధికారులు ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో వెలుగు ఏపీడీ వై.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

టీడీపీ కార్యకర్త ఆత్మహత్యా యత్నం

పాలకొండ: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణకు టికెట్ ఖరారు కాలేదని సోషల్ మీడియా ద్వారా సమాచారం రావడంతో పాలకొండకు చెందిన ఆరో వార్డు కౌన్సిలర్ అడపా జయ భర్త బాబ్జీనాయుడు ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించారు. గురువారం కోటదుర్గమ్మ ఆలయ జంక్షన్ వద్ద పెట్రోలు పోసుకుని నిప్పంటించుకునేందుకు ప్రయత్నించగా, పర్రి ప్రసాదు అనే వ్యక్తి వారించి, కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు.

శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు

పాలకొండ: పట్టణంలోని సదాశివుని ఆలయం, ఉమారామలింగేశ్వరస్వామి, భీమలింగేశ్వరాలయంతో పాటు పరిసర గ్రామాల్లోని శివాలయాలు శివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. పెద్దకోటిపల్లి గ్రామంలోని ఉమా కాత్యాయిని సహిత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. స్వామివారి యాత్రా మహోత్సవాలకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

10న గురుకుల ప్రవేశ పరీక్ష

భామిని: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి పరీక్షలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ విజయనిర్మల తెలిపారు. ప్రవేశ పరీక్షలు ఈ నెల 10న జరుగుతాయని చెప్పారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

సాలూరు రూరల్: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని మామిడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం నల్ల వెంకటరావు పిలుపునిచ్చారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు భవిష్యత్తు చదువుతోనే సాధ్యమన్నారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న గౌరునాయుడు

వీరఘట్టం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల ల్లో నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంఈవో డి.గౌరునాయుడు ఆదేశించారు. గురువారం స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎంలతో సమావేశం నిర్వ హించారు. ఈసందర్భంగా ఆయన నాడు-నేడు, ఎండీఎం ట్యాబ్‌ల అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు, ఎంఆర్‌సీలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

షాపు నెం.20 కథేమిటో?

● ఏడేళ్లుగా అద్దె చెల్లించకపోవడంపై మున్సిపల్ కౌన్సిలర్లు మండిపాటు


అధికారులను ప్రశ్నిస్తున్న చైర్‌పర్సన్

సాలూరు రూరల్: మున్సిపల్ కాంప్లెక్స్‌లో షాపు నెంబరు 20 కథేమిటంటూ వైస్ చైర్‌పర్సన్ జరజాపు దీప్తి, కౌన్సిలర్లు.. మున్సిపల్ అధికారులపై ధ్వజమెత్తారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 20వ నెంబరు షాపును వారు గురువారం పరిశీలించారు. ఈ షాపు ఖాళీగా ఉన్నట్టు రికార్డులో చూపితే తాళాలు ఎవరు వేశారని వారు ప్రశ్నించారు. దీనికి మున్సిపల్ మేనేజర్ రాఘవాచార్యులు, ఆర్ఐ శ్రీనివాసరావు తమ వద్ద ఆ షాపు తాళాలు లేవని సమాధానమిచ్చారు. షాపుపై ఉన్న నెంబర్‌కు ఫోన్ చేసి, మేనేజర్ రాఘువాచార్యులు వివరాలు కనుగొన్నారు. ఈ షాపు 2017 నుంచి ఓ వ్యక్తి స్వాధీనంలో ఉంటే ఇప్పటివరకు ఎందుకు అద్దె వసూలు చేయలేదని కౌన్సిలర్లు మండిపడ్డారు. అధికారుల వల్లే మున్సిపల్ ఆదాయానికి గండి పడుతున్నదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్నేళ్ల అద్దె డబ్బులు అధికారుల జీతాల నుంచి వసూలు చేసేందుకు కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేస్తామని హెచ్చరించారు. ఆ దుకాణంలో ఉన్న నిర్వాహకుడి సామగ్రి తీసుకెళ్లకుండా అధికారులు తాళాలు వేశారు. నిర్వాహకుడికి నోటీసులు ఇస్తామని చెప్పారు. ఇదే అంశంపై సాలూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధికారులను పిలిచి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం ఆ షాపు తాళాల్లేవని చెప్పిన అధికారులు సాయంత్రం ఉన్నాయంటూ రమ్మని తమను పిలవడం విడ్డూరంగా ఉందని కౌన్సిలర్ గిరి రఘు అన్నారు.

కార్యాలయాల ముందు వ్యర్థాలు

● ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగులు


రహదారికి ఆనుకొని కార్యాలయాల ముందు నిల్వ ఉన్న వ్యర్థాలు

గరుగుబిల్లి: మండల కేంద్రం గరుగుబిల్లిలో సేకరించిన వ్యర్థాలను రహదారికి పక్కనే కుప్పగా పోయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధాన రహదారికి ఆనుకొని ఒకవైపు మండల అభివృద్ధి కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, గృహ నిర్మాణ శాఖ, మండల ఉపాధి కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. కార్యాలయాలకు దగ్గరలోనే శ్మశాన వాటిక ఉంది. నిత్యం ఆరోగ్య కేంద్రంతో పాటు ఇతర కార్యాలయాలకు అధిక సంఖ్యలో ప్రజలు తరలి వస్తుంటారు. వ్యర్థాల నుంచి దుర్వాసన రావడంతో వారు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి చెత్తను మరోచోట వేసేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.